## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడిగింపు

**వర్గల్, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):**

వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశము కొరకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 23 వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోరేటటువంటి అభ్యర్థులు ప్రస్తుతం 5వ తరగతి 2024-25 విద్యా సంవత్సరం ఉమ్మడి జిల్లాలోనే చదువుతూ ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసము ఉమ్మడి జిల్లాలోనే ఉండాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్‌లో లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకు ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన ధృవపత్రం, ఫోటోతో దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు త్వరపడి తమ పిల్లలను ప్రోత్సహించి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## స్కూల్‌గేమ్స్‌లో జిల్లాస్థాయికి విద్యార్థుల ఎంపిక



**జోగిపేట, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండటన 17 బాలుర కబడ్డీ విభాగంలో మచ్చేందర్, గిరిధర్, అండర్ 14 బాలుర కబడ్డీకి శ్రీకాంత్, అండర్ 17 ఖోఖోలో దుర్గాప్రసాద్, అండర్ 17 బాలికల కబడ్డీలో ఆసిఫాలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 14 వాలీబాల్‌లో మధురిమ ఎంపికయ్యారు. తమ పాఠశాల నుంచి జిల్లాస్థాయికి ఎంపికయిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ నాగేశ్వర్‌రావు దాసరి, ప్రిన్సిపాల్ డెల్ఫిన్‌లీవర్, వ్యాయామ ఉపాధ్యాయులు నర్సింలు, భానుతేజలు అభినందించారు.

## సిఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

### పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసిన పార్టీ శ్రేణులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యాలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నియోజకవర్గంలోని వివిధ పోలీసు స్టేషన్లలో బిఆర్ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌లో బిఆర్ఎస్ యువత విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. చిన్నకోడూరు పోలీసు స్టేషన్‌లో బిఆర్ఎస్వి విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి తన భాష పద్దతి మార్చుకోవాలన్నారు. హరీష్‌రావుపై వ్యక్తగతంగా అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. మరో సారి ఇలాంటి వ్యాఖ్యాలు చేస్తే చూస్తూ ఉరుకోమన్నారు. ఆయా కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రాము, పర్శరాములు గౌడ్, ఇమ్రాన్, నరేష్, బాలరాజు, రాజు, రాజు, వేణు, మన్నె ఆనంద్, లింగం, రాజశేఖర్‌రెడ్డి, జగన్, రెడ్డి యాదగిరి, బండి శ్రీకాంత్, రాజమౌళి, రమేష్, వెంకటేష్, రెడ్డిభరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చక్రియాల్‌లో అనంత చతుర్ధశి

**చౌటకూరు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఈ నెల 17న మండలంలోని చక్రియాల్‌లో కొలువున్న శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించేందు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలో అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని రంగులతో అద్ది పూజలతో అందంగా అలంకరించారు. చతుర్ది వేడుకలను పురష్కరించుకుని ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటలకుస్వామి వారికి అభిషేకం, మహా విషేష పూజలు, అనంత వ్రతాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు, కమిటి బాధ్యులు పేర్కొన్నారు. గ్రామానికి పశ్చిమ భాగాన వెలిసిన ఆలయంలో ఎంతో ప్రశాస్యం, ప్రాముఖ్యతను కల్గి ఉంది. నాగు మొగలుల కాలంలో ఔరంగజేబు హిందూ దేవాలయాలను ధ్వంసం చేస్తున్న తరుణంలో కొన్నేళ్ల పాటు ఈ ఆలయాన్ని మట్టితో కప్పి ఉంచినట్లు చారిత్రక ఆధారాల ద్వార తెలుస్తోంది. కొన్నాళ్ల తరువాత మట్టిని తొలగించి దూప దీప నైవేద్యంతో నిత్యపూజలతో ఆలయం అలరారుతోంది. 15 ఏండ్ల క్రితం గ్రామస్థులు కలిసి ఆలయాన్ని పునర్‌నిర్మించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా కృషితో ఉమ్మడి రాష్ట్ర పాలనలో దేవాదాయ శాఖ ద్వార ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఆలయ గర్బగుడిని నిర్మించారు. గ్రామస్థులు, దాతల సహకారంతో విరాళాలు సేకరించి కోటిన్నర రూపాయలతో ఆలయ మండపం నిర్వించారు. ఆలయ ఎదురుగా ధ్వజస్థంభం ప్రతిష్టించాల్సి ఉంది. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్దాంతి పర్యవేక్షణలో ఆలయంలో తరుచూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి చతుర్ధశి వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించి, అన్నదానాన్ని స్వీకిరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు సూచించారు.

## హద్నూర్‌లో బొజ్జగణపయ్యకు భక్తుల భజనలు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** వినాయక చవితిని పురష్కరించుకుని మండలంలోని హద్నూర్ గ్రామంలో జై భవాని మాత గణేశ్ కమిటి ఆధ్వర్యంలో కొలువుదీరిన లంబదొరుడికి కాలనీ భక్తుల అర్చకులు శివమూర్తి స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆదివారం రాత్రికి విఘ్నేశ్వరుడికి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. రాత్రికి ఏకదంతుడి మండపంలో గ్రామ భక్తులు భక్తి పాటలను ఆలపిస్తూ రాత్రి 12 గంటల వరకు భజనలు చేశారు. మండపంలో రాత్రికి భజనలు చేసిన భక్తులకు ఉత్సవ కమిటి వారు శాలువాలతో సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ప్రతి నిత్యం బొజ్జగణపయ్యకు పూజా కార్యక్రమాల అనంతరం కాలనీ వాసులు (చిన్నారులు) కోలాటం వేస్తూ వస్తున్నారు. ఈ నెల 17న వినాయకుడిని గంగమ్మ ఒడికి (నిమర్జనం) తరలిస్తామని ఉత్సవ కమిటటి నిర్వాహకులు పేర్కొన్నారు.

## శ్రీశైలం కృష్ణానదిలో వినాయకుడి నిమజ్జనం



**హత్నూర సెప్టెంబరు 16, ప్రభాతవార్త** హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని వినాయక్‌చౌక్, రామాలయంవద్ద ఏర్పాటు చేసిన రెండు గణపతులను నిమజ్జనం కోసం నిర్వాహకులు, ఆదివారం రాత్రి దౌల్తాబాద్ నుండి వాహనాలలో తీసుకొని బయలుదేరి, రెండు వినాయకులతో శ్రీశైలం కృష్ణనదికి సోమవారం ఉదయం చేరుకొని, గణపతులకు పూజలు నిర్వహించి శ్రీశైలం కృష్ణనదిలో నిమజ్జనం చేశారు.

## పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో మేలు

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** పేద ప్రజలకు సిఎం సహాయ నిధి ఎంతో మేలు చేస్తుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన లచ్చయ్యకు రూ.60 వేల చెక్కును జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ తన దృష్టికి వస్తే జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖతో మాట్లాడి వెంటనే అందించడం జరుగుతుందన్నారు. సిఎం సహాయ నిధితో కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజిరెడ్డి, రాజేశంగౌడ్, రాగుల అశోక్, అంబటి విఠల్, పల్లె పర్శరాములు, కలీం, దాస అంజయ్య, భిక్షపతి తదితరులు ఉన్నారు.

## మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి మృతి

**ఝరాసంగం, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన మండలంలోని కక్కరవాడ తాజా మాజీ సర్పంచ్ డాకుర్ మోహన్‌రెడ్డి కానరాని లోకాలకు చేరిపోయారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం... మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో ఇటీవల హైద్రాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ వస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. సోమవారం గ్రామంలో మోహన్‌రెడ్డికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం, మాచ్నూర్ వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు బొగ్గుల జగదీశ్వర్, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు.

# గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

### పది పోలీసు పార్టీలతో బందోబస్తు : డిఎస్పి

**జహీరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఈ నెల 17న నిర్వహించే గణేష్ నిమర్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసేలా తగు చర్యలు తీసుకున్నట్లు డిఎస్పి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పివిఆర్ గార్డెన్‌లో పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం విలేఖరులతో డిఎస్పి మాట్లాడుతూ గణేష్ నిమర్జనానికి 10 పోలీస్ పార్టీలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిమర్జనానికి ఒక డిఎస్పి, 3 సిఐలు, 10 మంది ఎస్ఐలు, ఎఎస్ఐలు, 90 మంది పోలీసు బాలగాలతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్పెషల్ మొబైల్ పార్టీలు ఏర్పాటు చేసి సిసి కెమెరాలతో బందోబస్తును పర్యవేక్షించనున్నట్లు వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా డైవర్ట్ చేస్తున్నామని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. నిమర్జనాన్ని పురష్కరించుకుని ఉదయం మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు మధ్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ అధికరులతో మాట్లాడి మూసివేస్తున్నట్లు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు, సార్వజనిక్ కమిటి బాధ్యులు పోలీసులకు తమ వంతు సహకరించాలని సూచించారు. సమావేశంలో పట్టణ సిఐ శివలింగం, రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐలు వరప్రసాద్, రాజేందర్‌రెడ్డి, నరేష్, డివిజన్‌లోని ఆయా పోలీసు ఠాణాల సిబ్బంది పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న డిఎస్పి రామ్మోహన్‌రెడ్డి

# కాళికామాత ఆలయానికి అంకురార్పణ

### -పురోహితుల పూజలతో విగ్రహాల ప్రతిష్టాపన



కాళికా మాత ఆలయ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న పురోహితులు

**కంగ్టి, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజామాత్ తండా శివారులోని సాధు తాండలో కాళికా మాత ఆలయానికి బంజార పీఠాధిపతులు శేఖర్ మహారాజ్, ఆల్ ఇండియా సాధు ప్రతినిధి సంగ్రామ్ మహారాజ్, ఝూప మహారాజ్, సరిచంద్ మహారాజ్‌ల వేద మంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ చేశారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాల ప్రతిష్టాపన కొరకు గత మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయాన్ని ప్రారంభించి శిఖర ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్బంగా మహారాజ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిత్యం కొంత సమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించాలని, పెద్దలను గౌరవించాలని, తల్లిదండ్రులను ఆప్యాయంగా చేసుకోవాలని సూచించారు. ఐక్యమత్యంతోనే అభివృద్ది, పురోభివృద్ది సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు విద్యను అందుకోవాలని సూచించారు. ఈ నెల 26న బంజారాలకు కాశీ అయిన పొరదేవి ఆలయ ఆవరణలో నంగరా భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది హాజరవుతున్నందున బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కొండాపూర్ హనుమాన్ ఆలయ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సనాతన ధర్మంలో నడవాలని, చెడు అలవాట్ల (మధ్యం, గంజాయి)కు దూరంగా ఉండాలన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాజారామ్, సాధు తండాలతో పాటు పరిసర తండాలు, గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని కాళికా మాతను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి మహార్షుల ఆశీస్సులు అందుకున్నారు.

# పట్టుబడ్డ అంగన్‌వాడీ సరుకులు..!

### అధికారుల్లో కొరవడిన పర్యవేక్షణ
### సమగ్ర శిశు అభివృద్ధి సేవా సరుకులన్నీ అంగడి మయం

**టేక్మాల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రుపాయల వ్యయంతో తల్లులు, పిల్లల సమాగ్రాభివృద్ధి కోసం నిర్దేశించిన సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐ.సి.డి.యస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాలను నడుపుతోంది. చిన్న పిల్లలకు చదువుపై మక్కువ పెంచేందుకు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు గాను మెనో ప్రకారం పాలు, గుడ్లు, బాలమృతంతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఆదేశాలు అందజేసింది. టేక్మాల్ మండల పరిధిలోని హసన్ మహ్మద్‌పల్లి తండలోని అంగన్‌వాడి సరుకులన్ని ప్యాక్ చేసి కారులో పెడుతుండగా తండా వాసులకు పట్టుబడ్డారు. అందులో పాలప్యాకేట్లు, గుడ్లు, కంది పప్పు ఉన్నాయి. తండవాసులు అంగన్‌వాడి టీచర్‌ను నిలదీయగా పొంతన లేని సమాధనం చెప్పడంలో ఈ విషయమై మండల సూపర్‌వైజర్ శ్రీశైలకు తండ వాసులు ఫోన్ చేస్తే భర్త ఎత్తి రాంగ్ నెంబర్ అంటున్నారని తండవాసులు చెప్పారు. కాగా దేవుడు వరం అందించిన పూజరి కరుణించని చందంగా అంగన్‌వాడీలపై పర్యవేక్షణ జరుపాల్సిన సంబంధీత అధికారులు మామూళ్ళ మత్తులో ఉండడంతో అంగన్‌వాడి సరుకులన్ని అంగటి సరుకులుగా మారి ప్రభుత్వం లక్ష్యయన్ని నీరుగారుస్తున్నారన్నా విమర్శలున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో అంగన్‌వాడి సరుకులు అంగడి సరుకులుగా మారడంతో టేక్మాల్ మండలంలో అస్తవ్యస్తంగా మారింది. టేక్మాల్ మండల పరిధిలోని 29 పంచాయితీల్లో 73 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 59 అంగన్‌వాడి కేంద్రాలు, అందులో 14 ఉప కేంద్రాలుండగా కొన్నింటికి మాత్రమే సొంత భవనాలున్నాయి. మరో 26 కేంద్రాలకు అద్దెభవనాలున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో అంగన్‌వాడీల నిర్వహణను కొనసాగిస్తుంది. పర్యవేక్షణ లేక పోవడంతో వారంతపు సంతల్లోన వారి బంధువులచే అమ్మకానికి మార్కెట్లకు వెళ్లుతున్నట్లు సమాచారం. ఇలా అమ్ముకునేందుకు గాను టేక్మాల్ మండలంలో ప్రతి అంగన్‌వాడి కేంద్రాలలో పర్యవేక్ష పేరిట ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రం నుండి 2 వేల నుండి 3 వేల రూపాలయను వసుళ్లు చేస్తున్నట్లు తెల్సింది. ఈ డబ్బులు ఎందుకని అడిగితే మీరు సక్రమంగా డ్యూటీలు చేస్తున్నారా ఏమైనా..? వారికి వీరికి ఇవ్వడానికి కావాలని మండల సూపర్‌వైజర్ తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మాముళ్లు ఇస్తున్నం కదా మనకేం అంగన్‌వాడి కేంద్రాల్లోనఅండింది ఆట పాడిందే పాట అన్న తీరుగా అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి మారి సరుకులు నల్లబజారుకు తరలి వెళ్లుతున్నాయన్నా ఆరోపణలు చాల బలంగా ఉన్నాయి. పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన ఈ పథకం ఆశించిన రీతిలో అమలు జరగడం లేదు. సమయానికి రారు, వచ్చిన కేంద్రాల్లో ఉండరు. ఈవిషయమై మండల సభలో ప్రజా ప్రతినిధులు సైతం అధికారులను ప్రశ్నించిన విషయం తెల్సిందే. మండల సూపవైజర్లు సైతం మండలానికి వారం పది రోజులకు మారు చుట్టపు చూపుగా రావడం సెక్టార్ మీటింగ్‌లకు పరిమితమవుతున్నారే తప్ప అంగన్‌వాడి కేంద్రాలను పర్యవేక్షణ జరుపడం లేదన్న విమర్శలున్నాయి. అక్రమ వసూళ్లపై జిల్లా ఉన్నతా స్థాయి అధికారులు సమాగ్ర విచారణ జరిపి వారిపై వేటు వేస్తారా లేక మాకు ఆ మాముళ్లు వస్తాయి మాకు ఎందుకు అని ఉరుకుంటారా చూడాలి మరీ...!

# పర్యవేక్షణ పూజ్యం.. ఆర్ఎంపిలదే ఇష్టారాజ్యం

### ప్రాణాలు గాలిలో కలుస్తున్నా.. పట్టించుకోని అధికారులు

**హత్నూర సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** అధిఇకారుల పర్యవేక్షణ కరువ్వడంతో గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపిల ఆగడాలకు, అడ్డులేకుండా పోతుందని హత్నూర మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిమితులతో కూడిన వైద్యం చేయడానికి అనుమతులు పొందుతూ, వాటని పక్కనపెట్టి, లాభార్జనే ధ్యేంగా పనిచేస్తూన్నారు. ప్రజల ప్రాణాలతో చెటగాడం ఆడుతున్నారు. హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలో అనుమతులు లేకుండా ఆసుపత్రి, మెడికల్ షాపు నిర్వహిస్తున్నారని పిర్యాదులు రావడంతో, జిల్లా వైద్యఆరగ్యశాఖ అధికారి గాయత్రిదేవి చింతల్ చెరువులోని ప్రైవేటు ఆసుపత్రిని గతజూన్ 18న, సందర్శించి, నిభంధనలకు విరుద్దంగా ఆసుపత్రిని నిర్వహిస్తున్న, నిర్వాహకుడు రవీందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అసుపత్రిని, మేడికల్‌షాపును సీజ్ చేశారు. ఎపిమిది బెడ్‌లు వేసి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. డిస్‌పోజన్ సిరంజీలను వేడి చేసి వాడుతూ, వాటితో నిడిల్ మాత్రమే మారుస్తూ ప్రజల ఆరోగ్యలాతో ఆటలు ఆడుకుంటున్నట్లు తనిఖీలో అధికారులు గుర్తించారు. బయో మెడికల్ వేస్తూ, మొత్తం సంచుల్లో నింపి, అట్టి మూటలను ఆసుపత్రి అవరణ మెట్టమీద ఉంచి, రోగాల వ్యాప్తికి కారణమవుతున్నారని అప్పట్లో తనిఖీలు చేసిన వైద్యధికారిని గాయత్రిదేవి పెర్కొన్నారు. ఇదిలా ఉండగా, గతంలో డిఎం అండ్ హెచ్ సీజ్ చేసిన ఆసుపత్రిలో, చికిత్స నిమిత్తం వడ్డేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు వైద్యం నిమిత్తం, ఈనెల 12న, చింతల్ చెరువులోని ఆర్ఎంపి వైధ్యుని వద్దకు రాగా, వైద్యం చేయడంతో వైద్యం వికటించి యువకుడు మృతి చెందాడు, మృతుని కుటుంబీకులు, గ్రామస్థులు ప్రైవేటు ఆసుపత్రి ఎదుట అందోళన నిర్వహించారు. పిర్యాదు రాకపోవడంతో హత్నూర పోలీసులు కెసునమోదు చేయలేదని ఎస్.ఐ.సుభాష్ తెలిపారు. హత్నూర మండలంలోని వివిద గ్రామాలలో ఆర్ఎంపి వైధ్యులు కొందరు తమ పరిధులను మించి వైద్యం చేస్తూన్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహంచి నిభంధనలకు విరుద్దంగా ఆసుపత్రులను నిర్వహిస్తున్నావారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వివిద గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## లడ్డును దక్కించుకున్న నాగేందర్

**నర్సాపూర్ సెప్టెంబర్ 16. ప్రభాతవార్త:** నర్సాపూర్ బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డు ను ఆలయ కమిటీ అధ్వర్యంలో వేలం వేయగా ఆ లడ్డూ ను 1 లక్షా 12 వేల తో నర్సాపూర్ పట్టనానికి చెందిన మారుతి టైలర్స్ యజమాని ధూమ్ నాగేందర్ వేలం పాట లో 1 లక్షా 12 వేల పాడి వినాయకుడి లడ్డూ ను దక్కించుకున్నారు. ఈ ఆలయంలోని వినాయకుడిని అంగరంగ వైభవంగా వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పుళ్లతో, బాజా భజంత్రీలతో ఆటలు ఆడుతూ. పాటలు పాడుతూ వినాయకుడిని తరలించారు. అంతకు ముందు ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా భక్తులు ప్రజలు అందరూ ఆసక్తిగా తిలకించారు. ఈ వినాయకుడిని భక్తి శ్రద్దలతో, నియమ నిష్టలతో వైభవోపేతంగా నర్సాపూర్ రాయరావు కు తరలించారు. ఈ చేరువులో వినాయకుడిని నిమజ్జనం చేయడం జరిగింది.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**నర్సాపూర్ సెప్టెంబర్ 16. ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో ప్రతిష్టించిన వినాయకుల నిమజ్జన కార్యక్రమం నిర్వమిస్తున్నందున అధికారులు సోమవారం నర్సాపూర్ రాయరావు చెరువులో వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

ఈమేరకు ఈ ఏర్పాట్లను నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్, సిఐ జాన్‌రెడ్డి, మండల తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. నిమజ్జనం సందర్బంగా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా అన్ని ఏర్పాట్లను చూడటం జరిగిందని వినాయకుల నిమజ్జనానికి అవసరమైన క్రేన్ లను ఏర్పాటు చేశామని అదేవిదంగా లైట్లను ఇతర సదుపాయాలను కల్పించినట్లు మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. వినాయకుల నిమజ్జన కార్యమ్రాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపకోవాలని వారు సూచించారు.

## గణనాథుడి శోభాయాత్రకు సర్వం సిద్ధం

### -1200 మంది పోలీసులతో బందోబస్తు
### -జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఈ నెల 17న జిల్లా వ్యాప్తంగా జరుపుకునే వినాయక నిమర్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రూపేష్ చెన్నూరి మాట్లాడుతూ విఘ్నేశ్వరులను గంగమ్మ తల్లి ఒడికి చేర్చేందుకు నిర్వహించే శోభాయాత్ర వెళ్లే మార్గంలో విద్యుత్ వైర్లు లేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకున్నట్లు, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా నెడేకడ డైవర్షన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రధాన కూడళ్లలో, మజీదులు, దర్గాలు, చర్చీలపై రంగులు (గులాల్) పడకుండా ఎత్తైన బారికేడ్స్‌తో పాలితిన్ కవర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శోభాయాత్రను వీక్షించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కల్గకుండా ప్రధాన కూడళ్లలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమర్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద నీళ్లలనికి దిగకుండా బారికేట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, విగ్రహాలను నిమర్జనం చేయడానికి క్రేన్‌లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రమాదావశాస్తు అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటే తక్షణం స్పందించేందుకు గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంటారన్నారు. డిఎస్పి స్థాయి అధికారిచే సబ్ డివిజన్ల వారిగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటి మండప నిర్వాహకులు పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. నిమర్జనంలో పాల్గొనే వారు మత్తు పదార్థాలను తీసుకోవద్దన్నారు. వందతులను నమ్మవద్దన్నారు. ఊరేగింపులో కుంకుమ, గులాల్ తదితర రంగులను దారిన పోయే వారిపై చల్లకూడదన్నారు.

## వినాయకుడికి మండపం వద్ద అన్నదానం



**అల్లాదుర్గం, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీ పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సోమవారం అన్నదన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుగడాల లక్ష్మి భాగయ్య, ప్యారారం సునీత నరసింహులు దంపతులు మండపంలోని లంబోదరుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదాన వితరణ చేశారు. పూజా కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్ కమిటి బాధ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు



**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్ద పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లిం మైనార్టీ సోదరులు మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను సోమవారం భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఏస్గి గ్రామంలో గ్రామ ముస్లిం మైనార్టీ సోదరులు గ్రామంలోని పురవీధుల గుండా మజీద్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, కాంగ్రెస్ నాయకులు రహీమ్, ముస్లిం మత పెద్దలు ఇబ్రాహిం సాబ్, మహమూద్ మియా, హుస్సేన్‌సాబ్, మహబూబ్, సమీయొద్దిన్, మైపుజ్, మన్సూర్, సలావుద్దీన్, జమాల్, సాబేర్, కైఫ్, ముస్సవీర్ అలి, తాహెర్, జుబార్, ఇర్ఫాన్, ఫర్హాన్, అబు బక్కర్, సిద్దిక్, మౌలానా, గౌస్, అబ్దుల్ రహీమ్, ఎక్బాల్, యూనూస్, వసీం, ఫయ్యూమ్, రఫిక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### మనూర్‌లో..

**మనూర్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని రాయిపల్లి, బాదల్‌గావ్, ఎల్గోయి, బెల్లాపూర్ తదితర గ్రామాల్లో సోమవారం జామా మజీద్ కమిటి ఆధ్వర్యంలలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం మైనార్టీలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. మొహమ్మద్ ప్రవక్త జన్నదినాన్ని పురష్కరించుకుని మిలాద్ ఉన్ నబీ ఉత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నట్లు ఇమామ్ రోషన్ అలీ తెలిపారు. మానవాళి శ్రేయస్సు, శాంతిని నెలకొల్పేందుకు ఆఖరి ప్రవక్త మహమ్మద్ ఎన్నుకున్నట్లు అంతిమ (దైవ గ్రంథం) పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ సందర్బంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జామా మసీద్ కమిటి సభ్యులు, గ్రామ మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

**జహీరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** 5 కిలోల గంజాయిని అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎసై వరప్రసాద్ తెలిపిన కథనం ప్రకారం... మండల పరిధిలోని షేఖాపూర్ తండాకు చెందిన రాథోడ్ హరి అలియాస్ అర్జున్ రాథోడ్ చౌహాన్ అర్జున్, చౌహాన్ విజయ్, పవర్ వేణు, చౌహాన్ సతీష్ అలియాస్ కిరణ్‌లు గత కొన్ని సంవత్సరాల నుంచి కొత్తగూడెం ఇరిస్సా సరిహద్దు ఏరియాలలో, కర్ణాటకలో బీదర్ నుంచి నిషేదిత గంజాయితీని తీసుకుని వచ్చి జహీరాబాద్ చుట్టు ప్రాంతాల్లో అమ్ముకుంటూ ఉన్నారన్నారు. ఆదివారం నమ్మదగిన సమాచారం మేరకు ఉదయం 11 గంటల ప్రాంతంలో హుగ్గెల్లి గ్రామ శివారులోని షాలిమార్ హోటల్ వెనుకాల శిరీష వెంచర్ నందు వీరందరూ కలిసి చిన్న చిన్న పాకెట్లు చేసి గంజాయిని అమ్ముతుండగా అక్కడికి చేరుకున్న పోలీసులను గమనించి నలుగురు తమ కాళ్లకు బుద్దిచెప్పగా అర్జున్ రాథోడ్‌ను పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. అర్జున్ రాథోడ్ నుంచి 5 కిలోల గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 5 గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి అర్జున్ రాథోడ్‌ను రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. తప్పించుకుని పారిపోయిన ముగ్గరిని పట్టుకుని రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు.


బాబుమోహన్‌కు పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య-వంశీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసిన దృశ్యం

## ప్రముఖ సినీనటులు బాబుమోహన్‌కు రేలంగి వెంకట్రామయ్య-వంశీ జాతీయ పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో మూడు రోజులపాటు వంశీ ఆర్ట్ థియేటర్స 53వ వార్షికోత్సవాల సంబురాలుకార్యక్రమంలో భాగంగా 'సంగీత-నృత్య-నాటక సాహిత్య మహోత్సవాలు' నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు, అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకపల్లి ఆధ్వర్యంలో జరిగింది. పద్మ విభూషణ్, నటసమ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు, పద్మభూషణ్ డాక్టర్ భానుమతీ రామకృష్ణ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభలో 'నా స్మృతిపథంలో…వంశీ రామరాజు' పుస్తకాన్ని ఆవిష్కరించగా, మాజీమంత్రి, ప్రముఖ సినీనటులు బాబుమోహన్‌కు పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య-వంశీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం సుద్దాల అశోక్‌తేజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సినీనటులు మీర్అబ్దుల్లా, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు, గజల్ మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తరంగిణి రామరాజు-అనఘదత్త రామరాజు' ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కార్యక్రమం అందరిని అలరిం చింది. అదే విధంగా గోవాడ క్రియేషన్‌చే 'మూల్యం' నాటక ప్రదర్శన అద్భుతంగా సాగింది.

## బుక్‌ఫెయిర్‌కు సహాయ సహకారాలు అందించండి


గ్రంధాలయాల పరిషత్ ఛైర్మన్‌ను సత్కరిస్తున్న బుక్‌ఫేర్ బృందం

**ముషీరాబాద్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** డిసెంబర్‌లో జరగనున్న హైదరాబాద్ బుక్‌ఫేర్‌కు సహాయ సహకారాలు అందించాలని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ బృందం విజ్ఞప్తి చేశారు. బుక్‌ఫెయిర్ ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు సోమవారం మాట్లాడుతూ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడిస్తోందని అన్నారు. ఈ సంవత్సరం బుక్ ఫేర్ ఘనంగా నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించామని, అందులో భాగంగా రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కలిసి బుక్ ఫేర్‌కు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందచేశామని తెలిపారు. దీనిపై స్పందించిన డాక్టర్ రియాజ్ హైదరాబాద్ బుక్‌ఫేర్‌కు తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని హామీఇచ్చారని, అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని గ్రంధాలయాల పటిష్టతకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కూడా తమవంతు పాత్ర పోషించాలని కోరినట్లు తెలియచేశారు. గ్రంధాలయ ఛైర్మన్‌ను కలిసిన వారిలో బుక్‌ఫేర్ అధ్యక్షులు కవి యాకూబ్, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## హనుమాన్‌నగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు


నిమజ్జన వేడుకలో పాల్గొన్న హనుమాన్‌నగర్ కాలనీ వాసులు

**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** గణేశుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన వేడుకల్లో నగర వ్యాప్తంగా అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నాగోల్‌లోని తట్టిఅన్నారం హనుమాన్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సోమవారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూవేలం పాట నిర్వహించారు. ఆతర్వాత గణనాథుడికి వాహనంలోకి ఎక్కించి కాలనీలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, కోలాటం ఆడుతూ, డ్యాన్సులు చేస్తూ గణపయ్యను నిమజ్జనానికి సాగనంపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెదగాని రామకృష్ణ, ట్రెజరర్ భాను, ఆర్గనైజర్లు సతీష్, రమేష్, కరుణాకర్, రాము, జంగయ్య, భాస్కర్, సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం' ప్రదానం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 16ప్రభాతవార్త:**

భారతీయ సమాజంలో వివాహ వ్యవస్థ ఎంతో పవిత్రమైందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ పూర్వ ఛైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులాంతర,మతాంతర వివాహ దంపతులకు 'అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం' ప్రదానోత్సవ సభ కులనిర్మూలన సంఘం ప్రతి నిధులు డాక్టర్ సూర్య నారాయణ మాస్టర్, సూర్యసుధ, ప్రముఖ కోరియో గ్రాఫర్ సూర్యతేజ సుభ్రాంత్‌మాస్టర్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగ దారుల మండలి అధ్యక్షుడు మండడి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. పుర స్కారాలను ప్రదానం చేసిన అనంతరం జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ వివాహమే లేకపోతే మానవ సమాజ అభివృద్ధి జరగదని, మనుగడ కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదర్శ వివాహం చేసుకున్న 40ఏళ్ల వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ పురస్కారాలు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో పెరిక యాదయ్య కుల నిర్మూలన సంఘం సలహాదారు వి.లక్ష్మీనాగేశ్వరరావు, కులనిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎం.డి.వహీద్, పి.ఉమా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోల్నాకలో జరిగిన వినాయక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దూసరి లావణ్య, శ్రీనివాస్‌గౌడ్ దంపతులు



జయప్రద రామమూర్తి వేణువాద్య విభావరిలో దృశ్యం

## శాస్త్రీయ వేణువాయిద్యంతో శ్రీగణేష నవరాత్రి వేడుకలు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఎంతో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ గణేష నవరాత్రి వేడుకలను నగరంలోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతి ప్రధాన కళామందిరంలో సోమవారం రాత్రి ప్రఖ్యాత వేణువాద్య కళాకారిణి డా. జయప్రద రామమూర్తి శాస్త్రీయ వేణువాయిద్యంతో వీనులవిందు గావిస్తూ విచ్చేసిన అశేష భక్తజన సందోహాన్ని ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ నిర్వహణలో గ్లోబల్ ఫ్లూట్ ఫౌండేషన్ తత్వఆర్ట్స్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, వ్యాసభట్టు అనిల్‌కుమార్, విద్వాన్ ప్రేమ రామమూర్తి తదితరులు ముందుగా జ్యోతిప్రకాసనం చేసి ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. మామిడిహరికృష్ణ మాట్లాడుతూ పార్వతీదేవి, గంగమ్మ తల్లుల ముద్దుల కొడుకు విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాల్లో గంగమ్మతల్లి ఒడిలో చేరేందుకు సిద్ధమౌతున్న గణేషుడికి ఆదిమ అనాది జీవన సంగీతానికి కొలవో నెలవో ఆరంభమో, సంకేతమో అలాంటి శాస్త్రీయ సంగీత విభావరిని ప్రదర్శించి, అందించి మనకు చైతన్యాన్ని, స్ఫూర్తిని, ఆధ్యాత్మిక భక్తిపూర్వక వాతావరణాన్ని రసోల్లాసం ఒకవైపు కావిస్తుండగా మరోవైపు ఈరోజు సరస్వతీపుత్రి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి జయంతి కావడం, విద్వాన్ ప్రేమరామమూర్తికి కుమార్తె డా. జయప్రద రామమూర్తి వేణువాద్య సంగీత విభావరితో ఆత్మీయసత్కారం శుభపరిణామాలన్నారు. ఈ సందర్భంగా జయప్రద రామమూర్తి వేణువాద్య విన్యాసం అందర్నీ మైమరపించింది.

## బంతి నర్సింహ మాతృమూర్తికి తలసాని నివాళులు

**బేగంపేట సెప్టెంబరు 16, ప్రభాతవార్త :**


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని.

బేగంపేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్‌పార్టీ నాయకులు బంతి నర్సింహను మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం పరామర్శించారు.బంతి నర్సింహ మాతృమూర్తి శాంతమ్మ ఆదివారం రాత్రి మరణించారు.విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే తలసాని సోమవారం ఎన్‌బిటీ నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి శాంతమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బంతి ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీహరి, శేఖర్, అక్బర్, ఆరీఫ్, అఖిల్,నాగరాజు నివాళులర్పించారు.

## యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా రాజు


నియామకపత్రాన్ని అందిస్తున్న సంఘం జాతీయ అధ్యక్షులు

**హుస్నాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త :** యాదవ హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా యువత అధ్యక్షునిగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం సముద్రాల గ్రామానికి చెందిన జంగం రాజుయాదవ్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆసంఘం జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో రాజుయాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజు యాదవ్ సంఘంలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తూ కోహెడ మండలంలోని తమ సామాజిక వర్గానికి చెందిన వారికి చేస్తున్న సేవలను గుర్తించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సూచించారు.రాజు యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంశీమోహన్‌యాదవ్,ప్రచార కమిటీ ఛైర్మెన్ ఐలేష్‌యాదవ్,ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### పండగ వాతావరణంలో ప్రజా పాలన

## దినోత్సవ వేడుకలు నిర్వహిస్తాం : మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్16 ప్రభాతవార్త: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఎలాంటి ఇబ్బందులు రాకుండా మినిట్ టు మినిట్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఐడీవోసి కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించడానికి మినిట్ టు మినిట్ షెడ్యూల్ తయారు చేశామని, అట్టి షెడ్యూల్ ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. ఇట్టి వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథిచే జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు ఐడీవోసీ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, కలెక్టరేట్ ఏవో యూనస్, తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం నిర్వహించడం అభినందనీయం

### ఎమ్మెల్యే ముఠా గోపాల్


అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్‌లు వి.శ్రీనివాస్‌గుప్త, మమత సంతోష్‌గుప్త తదితరులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** గణపతినవరాత్రోత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం మంచి సంప్రదాయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం వివేక్ నగర్‌లో ప్రముఖ సంఘసేవకులు పి.రోహిత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్‌లు వి.శ్రీనివాస్‌రెడ్డి, మమత సంతోష్‌గుప్త తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సిరిగిరి శ్యామ్, నేతా శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్య నారాయణ, ముచ్చకుర్తి పద్మ, ముచ్చకుర్తి ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు జి.జయేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డల రక్షణ


అంగన్‌వాడీలో పోషణమాసం వేడుకల దృశ్యం

**అక్కన్నపేట, సెప్టెంబరు 16,ప్రభాతవార్త :** తల్లి,బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే వారికి పౌష్టికాహారమే అందించాలని అంగన్‌వాడీ టీచర్ శ్రీలత అన్నారు. సోమవారం రోజున అక్కన్నపేట మండలంలోని కేశనాయక్‌తండా పరిధిలోని చెరువు ముందు తండాలో జాతీయ పోషణమాసం సందర్భంగా తండాలోని గర్బిణీలకు శ్రీమంతం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు, గర్బిణస్త్రీలు,బాలింతలకు పౌష్టికాహారం పై ఆశా కార్యకర్తలతో కలసి అవగాహన కల్పించారు. పోషక ఆహార లోపాన్ని ఎక్కువగా పిల్లలు,గర్బిణీలు,బాలింతలలో ఎక్కువ చూస్తుంటామని దీనిని నివారించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోషణమాస కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం సెప్టెంబరు నెలలో నిర్వహిస్తుందని గుర్తు చేశారు.ఈ పౌష్టికాహారం, పౌష్టికాహారం తీసుకోకుంటే జరగే అనర్థాల గురించి ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ ధ్యేయం అని, అందుకే అంగన్ వాడీ కేంద్రాల ద్వార ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మీ,మాజీ సర్పంచ్ రవిందర్‌తో పాటు గర్బిణీస్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## దండుపల్లికి చేరుకున్న పాదయాత్ర

### క్రిమిలేయర్ విధానం అమలుకు కిన్నెర సిద్దార్థ డిమాండ్


మాట్లాడుతున్న దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ

**రామాయంపేట, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** ఎస్‌సి రిజర్వేషన్స్‌లో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని కోరుతూ దళిత వికాస సమితి ఆధ్వర్యంలో ఈనెల 1న ఆదిలాబాద్ పట్టణంలో ప్రారంభించిన దళిత సమన్యాయం పాదయాత్ర సోమవారం 15వ రోజు మనోహరబాద్ మండలం దండుపల్లి గ్రామ దళితవాడకు చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక దళిత నాయకులు మరాఠి రాజు, దళితులు గణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ మాట్లాడుతూ ఈ యాత్ర 40 రోజులపాటు కొనసాగి, గద్వాల్ జిల్లా అలంపూర్‌లో ముగుస్తుందని, గత 70 సంవత్సరాల నుండి అమలవుతున్న ఎస్‌సి రిజర్వేషన్స్ ఫలాలు పొంది 3 శాతం మంది దళితులు సంపన్న వర్గంగా మారారని తెలిపారు. ప్రస్తుతం వీరి కుటుంబ సభ్యులే ఎస్‌సి రిజర్వేషన్స్ అన్ని ఆక్రమించుకున్నారని, వీరితో ఇప్పటి వరకు రిజర్వేషన్స్ ఫలాలు పొందని ఎస్‌సి కుటుంబాలు పోటీ పడకలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తే పేద దళితులు రిజర్వేషన్స్ ఫలాలు దక్కించుకుంటారన్నారు. బిసి రిజర్వేషన్‌లో, ఓసి రిజర్వేషన్స్‌లో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తున్న పాలకులు ఎస్‌సిల్లో క్రిమిలేయర్ విధానం అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎస్‌సి రిజర్వేషన్స్‌లో క్రిమిలేయర్ విధానం అమలు చేసి పేద దళితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత వికాస సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు దోమ నగేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాంరెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 16 ,ప్రభాతవార్త**

శ్రమ జీవుల విముక్తి కోసం నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి ఏలురి రాంరెడ్డి అని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ అన్నారు.సోమవారం ఆయన 6వ వర్థంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ రాంరెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం పేద ప్రజల రాజ్య స్థాపన కోసం పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు.ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి,బాలయ్య, మల్లారెడ్డి, ఎల్లయ్య, అక్బర్, అంకుశావళి, గణేష్, ఎల్లయ్య, నవ్య, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## కేంద్ర మంత్రి ఆదేశాలను లెక్క చేయని జాతీయ రహదారి అధికారులు...కాంట్రాక్టర్...!

**అధికారుల తీరుపట్ల ఎస్సీ కాలనీవాసుల అసంతృప్తి**
**సమస్య పరిష్కరించకుంటే ఫిర్యాదు చేసేందుకు సిద్ధమౌతున్న కాలనీ వాసులు**

**హుస్నాబాద్ ,సెప్టెంబరు 16,ప్రభాతవార్త :**

రెండు రోజుల క్రితం ప్రభాతవార్తలో జాతీయ రహదారి నిర్మాణం..ఎస్సి కాలనీ వాసులకు శాపమా.. అనే శీర్షికతో ప్రచూరితమైన వార్తకు కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ స్పందించి కోహెడ మండలం సముద్రాల గ్రామంలోని ఎస్సి కాలనీలో జాతీయ రహదారి నిర్మాణం విషయంలో ఎదురైన సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం పట్ల ఆ కాలనీ వాసులతో పాటు గ్రామస్థులు అధికారులు,కాంట్రాక్టర్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం జాతీయ రహదారి పక్కన నిర్మించిన మురుగు కాలువకు రంధ్రాలు చేయాలని అధికారులకు ఆదేశించినా చేస్తామని చెప్పిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మళ్లీ వర్షాలు కురిసి ఎస్సి కాలనీలోని ఇండ్లకు నీరు చేరకముందే సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులు,కాంట్రాక్టర్‌లపై ఎంతైనా ఉంది. అయితే ఈ విషయంపై అధికారులు,కాంట్రాక్టర్ స్పందించకుంటే స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర రవాణా ,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో పాటు జాతీయ రహదారుల ఈఈలకు అధికారులు,కాంట్రాకర్‌ల తీరుపై ఫిర్యాదు చేస్తామని ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్,జాతీయ మాల మహానాడు గ్రామ ప్రధాన కార్యదర్శి ఆరే కిషోర్,మాజీ వార్డు సభ్యులు కనగండ్ల కుమార్,కాలనీ వాసులు ఆరే లక్ష్మయ్య,వేల్పుల బాలయ్య,కనగండ్ల మల్లేష్,బాలయ్య,నర్సయ్యలు హెచ్చరిస్తున్నారు.


పూజలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యంయాదవ్

## ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలు : ముత్యంయాదవ్

**చార్మినార్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలు జరుపుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ముత్యంయాదవ్ అన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గంలోని శ్రీసోమనాథ్ మందిరంలో ప్రతిష్టించిన శ్రీ విఘ్నేశ్వరునికి ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యంయాదవ్‌ను శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పూజారితోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా గణేష్ నవరాత్రి మహోత్సవాలు


పూజలో పాల్గొన్న మహకాళ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

**మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** శ్రీరామ్ కాలనీలో వైభవంగా శ్రీగణపతి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీరామ్ కాలనీ మహకాళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయకునికి భక్తులు భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పూజ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఫునేట్ రాజు,లక్ష్మీ నారాయణ,శ్రీ కాంత్,విష్ణుతో పాటు మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.

### పాతబస్తీలో రెండు లక్షల యాభై వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ

**చార్మినార్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** శ్రీగణేష్ నిమజ్జనం శోభా యాత్ర సందర్భంగా పాతనగరంలో రెండులక్షల యాభైవేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు మిశ్రిగంజ్ వాటర్ వర్క్స్ డిజిఎం ఎస్.మహ్మద్ అబ్దుల్ హాకీం తెలిపారు. పాతనగరంలో శోభా యాత్ర కొన సాగే లాల్ దర్వాజ చౌరస్తా, శాలిబండ, ఫిస్తాహౌస్, చార్మినార్, మదీనా, నయాపూల్ వద్ద టెంట్‌లు ఏర్పాటు చేశామని, యాత్రలో పాల్గొనే భక్తులకు వాటర్ ప్యాకెట్లను అందజేస్తున్నామని ఆయన తెలియజేశారు. వాటర్ వర్క్స్ సిబ్బంది వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేయనున్నారని డిజిఎం మహ్మద్ అబ్దుల్ హాకీం తెలిపారు.

## జర్నలిస్ట్ కాలనీలో ఘనంగా వినాయకుడి శోభయాత్ర


వేలం పాటలో లడ్డును దక్కించుకున్న గోవిందరావు, వనిత దంపతులు

**కొంపల్లి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ పరిధి జర్నలిస్ట్ కాలనీలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం సాయంత్రం వినాయక శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పూజ కార్యక్రమాలు నిర్వహించి ఉట్టి కొట్టె కార్యక్రమం, ఆట పాటలు నిర్వహించి పెద్ద ఎత్తున పిల్లలు, మహిళలు, పురుషులు పాల్గొన్నారు. అనంతరం లడ్డు వేలం పాటలో పాల్గొని 82,116 రూపాయలకు గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అంగూరు గోవిందరావు, వనిత దంపతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఏ.గోవిందరావు, దేవేందర్ గుప్తా, రాము యాదవ్, పితాని శ్రీనివాసరావు, మల్లికార్జున్, వెంకట్‌రావు, జగదీష్ గుప్తా, దాలినాయుడు, లక్ష్మణ్, రమేష్, సతీష్ కుమార్, గురువయ్య, మహేష్, గణేష్, లక్ష్మీనారాయణ, జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏ.మారుతి సాగర్, ఎం.లాలయ్య, సుధాకర్‌రెడ్డి, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజెలు పెడితే చర్యలు తప్పవు : ఎస్ఐ

**వర్గల్, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** వినాయక నిమజ్జన కార్యక్రమంలో డిజెలు పెడితే చర్యలు తప్పవని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిజెలు పెట్టడం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు చాలా ఇబ్బందులకు గురవుతారని, డిజే శబ్ధాల వల్ల గుండెనొప్పి వచ్చే అవకాశం ఉందని, కావున డిజేలను ఉపయోగించవద్దన్నారు. పోలీసుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎవరైనా డిజేలు పెట్టినట్లయితే కేసు నమోదు చేయడంతో పాటు డిజే సిస్టమ్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## బైక్ దొంగలు అరెస్ట్.. ఎనిమిది బైక్‌లు స్వాధీనం..

**పంజగుట్ట, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త):** ఇద్దరు బైక్ దొంగలను అదుపులోకి తీసుకుని వారినుంచి ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సంజీవరెడ్డి నగర్ పోలీసులు సంయుక్తంగా దాడులుచేసి ఇరువురిని పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, ప్రొద్దుటూరుకు చెందిన పల్లా ధర్మతేజ, సిరివెళ్ల గురప్పలు నగరంలో ఉంటూ బైక్ దొంగతనాలకు అలవాటు పడ్డారు. వీరిలో ధర్మతేజ బైక్ దొంగతనం కేసులో గతంలో అరెస్టయి జైలుకు వెళ్లాడు. విడుదలైన అనంతరం పాత స్నేహితుడితో కలసి బైక్ దొంగతనాలు పెద్ద ఎత్తున చేయడానికి పథకం రచించాడు. హైదరాబాద్‌లో ఐదు బైక్‌లను చోరీ చేశారు. మరో మూడుబైక్‌లను వివిధ ప్రాంతాలలో దొంగతనం చేశారు. టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ సుధీంధ్ర ఆధ్వర్యంలో పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము దొంగతనాలు చేసిన విషయం అంగీకరించారు. ఇవేకాక గతంలో తాము చేసిన నేరాలను కూడా పోలీసుల విచారణలో అంగీకరించారు. వెంటనే వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరినుంచి 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## పెట్రోల్ బంకులో మహిళాపై దాడి

**గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** నగరంలోని అబిడ్స్ ప్రాంతంలోని పెట్రోల్ బంకులో ఓ మహిళాపై అకారణంగా దాడి చేసి సంఘటన ఆదివారం రాత్రి అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాహనదారులు, బంకు సిబ్బంది, పోలీసుల కథనం ప్రకారం… అబిడ్స్ ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఓ మహిళా పెట్రోల్ కోసం క్యూలో నిలబడింది. అదే సమయంలో ముందు బండిపై ఉన్న వ్యక్తి ముందుకు వెళ్లాలని చెప్పడంతో ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపంతో ఊగిపోయిన ఆ వ్యక్తి అకారణంగా మహిళపై దాడి చేశారు. అక్కడే ఉన్న వాహనదారులు, అతడిని ఆపినప్పటికి ప్రయోజనం లేకపోయింది. దీంతో సదరు మహిళా బంధువులు అక్కడికి చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్ దగ్గర రెండు వర్గాలు ఆందోళన దిగారు. మహిళపై దాడి చేసిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ గొడవపై అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తికే పోలీసులు మద్దతు పలుకుతున్నట్లు మహిళా బంధువులు ఆరోపించారు. కాగా గతంలోనూ అబిడ్స్ పోలీస్‌స్టేషన్ చౌరస్తావద్ద ఇలాంటి సంఘటన జరిగినప్పుడు ఇదేవిధంగా పోలీసులు వ్యవహరించినట్లు తెలిసింది. వినాయక నిమజ్జనం సమయంలో ఇలాంటి ఆరాచకాలు చేస్తే పోలీసులు ఏమి చేస్తున్నట్లు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న గాంధీనగర్ ఏసిపి మొగులయ్య

## గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి
### గాంధీనగర్ ఏసిపి మొగులయ్య

**ముషీరాబాద్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త):** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య సిబ్బందికి సూచించారు. ఆదివారం రాత్రి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గణేష్ నిమజ్జనాలలో బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో జరిగే గణేష్ నిమజ్జనాలకు దేశవ్యాప్తంగా ప్రాధాన్యత ఉందని, లక్షలాది మంది భక్తులు ఈ నిమజ్జనాలకు తరలి వస్తారని గుర్తు చేశారు. వేలాది విగ్రహాలు ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేస్తారని, ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, శాంతి భద్రతలకు అంతరాయం ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ ఎస్‌హెచ్‌ఓ డి.రాజు, గాంధీనగర్ పోలీస్ సిబ్బంది మరియు బందోబస్తు కోసం వచ్చిన 130 మంది ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు
### -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్16 ప్రభాతవార్త: గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం కొంటూరు చెరువులో గణేష్ నిమజ్జన ప్రాంతాల ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. భక్తిశ్రద్ధలతో గణనాథులను సాగనంపుటకు భక్తులు చేయాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కొంటూరు చెరువు వద్ద బారికేడ్లు, 3 క్రేన్లు, 1 జేసీబీ, 10 మంది గజ ఈతగాళ్లు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిమజ్జనానికి పోలీసు బందోబస్తుతో సహా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ మండలి నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, యువకులు ఎలాంటి భావోద్వేగాలకు గురికాకుండా క్రమ పద్ధతి పాటించాలన్నారు. విద్యుత్ తీగల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, నిమజ్జనం చేసే సదరు నిర్వాహకుల హెచ్చరికలు కాదని భక్తులు నీటిలోకి దిగే ప్రయత్నం చేయొద్దన్నారు. ప్రధానంగా ఊరేగింపు సమయంలో ఆధ్యాత్మిక చింతన ప్రజ్వరిల్లేలా మన సంస్కృతి, సంప్రదాయాల భక్తి పాటలు, నృత్యాలు, కోలాటాలు పెట్టుకోవాలని, విగ్రహాలను తరలించే వాహనాల కండీషన్ సరిగ్గా ఉండేలా చూడాలన్నారు. అపశ్రుతులకు తావు లేకుండా వినాయక నిమజ్జనం సాఫీగా ముగియాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఈఈ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆద్యంతం..నిఘా నేత్రం

### సిసిసిల నుంచి శోభాయాత్ర పర్యవేక్షణ
### ఊరేగింపు మార్గాల్లోని వేల కెమెరాల అనుసంధానం

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త**

నిమజ్జనం నేపథ్యంలో మంగళవారం నగరంపై పోలీసు విభాగం డేగకన్ను వేసింది. ఊరేగింపు మార్గాలతోపాటు పరిసర ప్రాంతాలు, రహదారుల, హుస్సేన్‌సాగర్ చుట్టూ పర్యవేక్షణకు నగర పోలీసు విభాగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా మార్గంలో ఇప్పటికే ఉన్న ట్రాఫిక్, కమ్యూనిటీ సిసి కెమెరాలకు తోడు తాత్కాలిక ప్రాతిపదికన అదనంగా కెమెరాలు ఏర్పాటు చేసింది. శోభాయాత్ర జరిగే రూట్‌లలో ప్రతి అణువూ రికార్డు అయ్యేలా చర్యలు తీసుకుంటూ, వేల సంఖ్యలో ఉన్న శాశ్వత సిసి కెమెరాలకు తోడు అదనపు కెమెరాలు ఏర్పాటు చేసిన నగర పోలీసులు వీటిని బషీర్‌బాగ్‌లోని పోలీసు కమిషనరేట్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (సిసిసి), ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లతో (టిసిసిసి) అనుసంధానించారు. దీంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్, ఏసిపిలతో పాటు ఎంపిక చేసిన అధికారులు తమ సెల్‌ఫోన్ల ద్వారానూ దృశ్యాలను చూసేలా ఏర్పాటు చేశారు. వీటిని డిజిపి మహేందర్‌రెడ్డి సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. హుస్సేన్‌సాగర్, ఎంజే మార్కెట్, చార్మినార్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు బేరీజు వేస్తూ అనుకోని సవాళ్లు ఎదురైతే వ్యూహాత్మకంగా ఎదుర్కొవడానికి నిఘా కొనసాగించారు. సిసిసిలో ఉండే మ్యాప్‌ల ద్వారా ఊరేగింపు రూట్‌తో పాటు చుట్టుపక్కల మార్గాలనూ అధ్యయనం చేస్తూ నిఘా ఉంచారు. నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ పరిస్థితుల్ని ఆద్యంతం పర్యవేక్షించారు. ప్రతి ఏడాది నిమజ్జనం జరిగేప్పుడు అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ఫలితంగా ఆయా చోట్ల ఉన్న సిసి కెమెరాలు పనిచేయక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈసారి సిటీ పోలీసు విభాగం సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలను ప్రత్యేక జియో ట్యాగింగ్ ద్వారా మ్యాప్ మీదికి తీసుకు వచ్చారు. వీటిని అధికారులు తమ సెల్‌ఫోన్ల ద్వారా చూసుకునే అవకాశం కల్పించారు. దీంతో పాటు మ్యాప్ మీద విద్యుత్ సరఫరా లేక ఆగిపోయిన కెమెరాలు ప్రత్యేక రంగుల్లో కనిపించేలా డిజైన్ చేశారు.

ఫలితంగా సిసిసిలో ఉన్న అధికారులు ఊరేగింపు మార్గాల్లోని ఏఏ చోట్ల విద్యుత్ సరఫరా ఆగిపోయిందో తక్షణం గుర్తిస్తున్నారు. ఆ విషయాన్ని కంట్రోల్ రూమ్‌లోనే ఉన్న విద్యుత్ శాఖఅధికారులకు తెలిపి తక్షణం విద్యుత్ సరఫరా పునరుద్ధరించే ఏర్పాట్లు చేశారు. అలాగే ట్రాఫిక్ మళ్లింపుల నేపథ్యంలో అనేక చోట్ల ఆర్టీసి బస్సులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ సమస్యల్నీ సిసిసిలో ఉన్న ఆర్టీసి అధికారులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చి ఆ ఇబ్బందులు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

## నాసిరకం చైనీస్ చిప్‌లతో జాతీయ భద్రతకు ముప్పు

### తెలంగాణా రవాణా శాఖ స్మార్ట్ కార్డులలో ఈ చిప్‌లు వాడకం..

**పంజగుట్ట, సెప్టెంబర్16 (ప్రభాతవార్త):** తెలంగాణ రవాణా శాఖ స్మార్ట్ కార్డులలో నాసిరకం చైనీస్ చిప్‌లు వాడుతున్నారని, దీనివల్ల జాతీయ భద్రతకు ముప్పు తప్పదని రాహత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి హెచ్చరించారు. సోమవారం సోమాజీగూడలో ఈ విషయాన్ని రవాణాశాఖ మంత్రికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రవాణా శాఖకు సంబంధించి స్మార్ట్‌కార్డుల పంపిణీ కలర్‌ప్లాస్ట్ ఇండియా లిమిటెడ్‌కు ఇచ్చారన్నారు. ఈ కార్డులు నిబంధనలకు అనుగుణంగాలేవన్నారు. ఈ స్మార్ట్ కార్డులతో హ్యాకింగ్, డేటాలీక్ అనధికార ప్రవేశానికి ఆస్కారం ఉందన్నారు. ఇది వినియోగదారుల గోప్యతను ప్రమాదంలో పడేసేట్టని చెప్పారు. స్మార్ట్ కార్డులను నాసిరకం చైనీస్ చిప్‌లతో సరఫరా చేయడం ద్వారా చట్టవిరుద్ధమైన పద్ధతులను అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. చైనా మూలానికి చెందిన ఈ మాడ్యూల్ చిప్‌లు దేశ సైబర్ భద్రతకు ముప్పు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా తాము విషయాలను న్యాయస్థానం దృష్టికి తీసుకువెళతామన్నారు.

## నిమజ్జనంలో జాతీయ జెండాలతో పాల్గొనాలి

### ఉత్సవ సమితి కార్యదర్శి శశిధర్

**గోషామహల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**

భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి, విహెచ్‌పి అధికార ప్రతినిధి రవినూతల శశిధర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సామూహిక నిమజ్జనాన్ని జరుపుకునేందుకుగాను పోలీసులు, నిర్వాహకులకు సహకరించాలన్నారు. పోలీసులు మండపాల నిర్వాహకులను బెదిరించి వత్తిడి తీసుకురావద్దన్నారు. ప్రశాంత వాతావరణం జరిగేందుకుగాను ఉత్సవ సమితి నిర్వాహకులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తున్నప్పటికి వత్తిడి తీసుకువచ్చి, బెదరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భారీ వాహనాలు కావడంతో వేగంగా పోలీసులు పరుగెతిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున, అంబేద్కర్ విగ్రహం, నెక్లెస్‌రోడ్డు చౌరస్తాలో పోలీసులు యువకులపై లాఠీ చార్జ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. శోభయాత్రలో మండపాల నిర్వాహకులు, యువకులు ఆడుకుంటే పోలీసులు వచ్చి బెదిరించి లాఠీలతో కోట్టినట్లు యువకులు తెలిపారు. ఉన్నతాధికారులు చెప్పేది ఒకటి, చేసేది ఒకటి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు లాఠీలతో యువకులను కొట్టాల్సిన అవసరం ఎంటి అన్ని ప్రశ్నించారు. పోలీసులకు తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాలతోపాటు కాషాయ జెండాలను పట్టుకుని సామూహిక వినాయక శోభయాత్రలో పాల్గొనాల్సిందిగా కోరారు.

# నిమజ్జనానికి సర్వం సిద్ధం...

* భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నిరకాల చర్యలు
* 25 వేల మంది పోలీసులతో పటిష్ట బంధోబస్తు
* 15వేలమంది జిహెచ్‌ఎంసి సిబ్బందితో సేవలు
* అర్ధరాత్రి 2గంటల వరకు మెట్రోరైల్ వేళలు పొడిగింపు
* 64 ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్స్..బారీకేడ్లు ఏర్పాటు



**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:**

గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిహెచ్‌ఎంసి, పోలీస్, ట్రాఫిక్ విభాగాలు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిహెచ్‌ఎంసి పరిధిలోని పలు చెరువుల్లో నిమజ్జనాలు కొనసాగుతుండగా.. చివరిరోజు మంగళవారం హుస్సేన్‌సాగర్‌కి పెద్ద ఎత్తున తరలిరానున్నాయి. బాలాపూర్ వినాయకుడి నుంచి హుస్సేన్‌సాగర్ వరకు దాదాపు 21 కిలోమీటర్లు శోభయాత్ర కొనసాగనుంది. ఈ మేరకు సోమవారం జిల్లా జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, కమిషనర్ అమ్రపాలి హుస్సేన్‌సాగర్ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి వచ్చేభక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలో 360 క్రేన్‌లను ఏర్పాటు చేశామని 15 వేలమంది సిబ్బంది మూడుషిఫ్టుల్లో భక్తులకు సేవలందిస్తారని తెలిపారు ముఖ్యంగా శానిటేషన్, ఇంజనీరింగ్, యుబిడి, యుసిడి విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. నగర వ్యాప్తంగా నిమజ్జనానికి 10 కంట్రోల్ రూంలు, కమాండ్ కంట్రోల్ రూంలో అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు మరో 500 మంది సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 468 క్రెయిన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నగర వ్యాప్తంగా 73 ప్రాంతాల్లో వినాయక పాండ్స్, పెద్దచెరువుల్లో నిమజ్జన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే నిమజ్జనానికి వచ్చేటప్పుడు కలర్ పేపర్లు వేదజల్లడం వల్ల వాటిని శుభ్రం చేయడానికి శానిటేషన్ సిబ్బందికి ఇబ్బంది తలెత్తుతున్నందున భక్తులు అలాంటి కలర్ పేపరులన వెదజల్లకుండా శానిటేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. అలాగే 25 వేల మంది పోలీస్ సిబ్బంది నిమజ్జన వేడుకలకు సేవలందించనున్నారు.

### 64 చోట్ల ట్రాఫిక్ మళ్లింపు...

మొత్తం నగరంలో 64 చోట్ల ట్రాఫిక్ డైవర్షన్‌లు ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ వెల్లడించారు. ట్యాంక్‌బండ్ సమీపంలో 8 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. బాలాపూర్ నుంచి గుర్రంచెరువు ట్యాంక్‌పై కట్టమైసమ్మ ఆలయం దగ్గర గణేష్ విగ్రహ ఊరేగింపు హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని కమిషనర్ తెలిపారు. కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్, ఎంబీఎస్‌ఆర్ ఎక్స్‌రోడ్డు మీదుగా మొహంజా మార్కెట్, అబిడ్స్ ఎక్స్‌రోడు, బషీర్‌బాగ్, లిబర్టీ ఎక్స్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, పివిఎన్‌ఆర్ మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వైపు వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అలాగే సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే వినాయక విగ్రహ ఊరేగింపులు సంగీత్, ప్యాట్నీ, ప్యారడైజ్, ఎంజీరోడ్డు, ట్యాంక్ బండ్ మీదుగా నెక్లెస్ రోడ్డుకు వెళ్లనున్నాయి. ఇక చిలకలగూడ కూడలి నుంచి వచ్చే విగ్రహాలు గాంధీ ఆసుపత్రి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, నారాయణగూడ ఫ్లైఓవర్, వైజంక్షన్, హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ వైపు వెళతాయని పోలీసులు సూచించారు. దీంతో పాటు ఉప్పల్ నుంచి వచ్చే గణేష్ ఊరేగింపులు రామతపూర్, శ్రీరమణ జంక్షన్, చే నంబర్, తిలక్ నగర్, ఓయూ, విద్యానగర్ జంక్షన్, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పుర జంక్షన్ మీదుగా వెళ్ళాలి. ఈ ఊరేగింపులు నారాయణగూడ వైఎంసీఏ జంక్షన్‌కు చేరుకుని ఆర్టీసీక్రాస్ రోడ్డునుంచి వచ్చే ఊరేగింపుతో కలవనుంది. దీంతో పాటు దిల్‌షుక్‌నగర్ నుంచి వచ్చే గణేష్ విగ్రహాలు ఐఎస్‌సదన్, సైదాబాద్, చంచల్‌గూడ నుంచి వచ్చే ఊరేగింపుతో నల్గొండ ఎక్స్‌రోడ్డులో కలువనుందని పోలీసులు తెలిపారు. ఇక తార్నాక వైపు వచ్చే విగ్రహాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం, దూర విద్యాకేంద్రం రోడ్డు, అడిక్‌మెట్ వైపు వెళ్లి విద్యానగర్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు వెళ్లనున్నాయి. ఇక ఎర్రగడ్డ నుంచి వచ్చే విగ్రహాలు ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజగుట్ట, ఖైరతాబాద్ మీదుగా మొహిదీపట్నం వైపు నుంచి వచ్చే ఊరేగింపు నిరంకారిభవన్ వద్ద చేరి ఎన్టీఆర్ మార్గ్ వరకు వెళ్లనున్నాయి. అలాగే టప్పాచపుత్ర, ఆసిఫ్‌నగర్ ప్రాంతాలనుంచి వచ్చే గణేష్ విగ్రహాలు సీతారాంబాగ్, బోయిగూడ కమాన్, గోషామహాల్, మాలకుంట జంక్షన్ మీదుగా వెళ్లి ఎంజెఎం దగ్గర ప్రధాన ఊరేగింపులో కలుస్తాయని పోలీసులు తెలిపారు. ఆయా ప్రాంతాలలో వినాయక విగ్రహాల ఊరేగింపుల నేపథ్యంలో సాదారణ ప్రజలు ఆ రహదారులకు వెళ్ళకుండా ప్రత్యామ్నాయ రహదారులలో ప్రయాణించేలా చూసుకోవాలన్నారు...



## ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు జరుపుకోవాలి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త :**

నగరంలో గణేషన నిమజ్జనానికి జిహెచ్‌ఎంసి విస్తృత ఏర్పాట్లుచేసిందని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ అమ్రపాలి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ప్రతి ఏటా నిమజ్జనం కోసం సమీప ప్రాంతాల్లో నిమజ్జన కొలనులు (పాండ్) లను ఏర్పాటు చేస్తుందని ఈసారి 73లొకేషన్లలో వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా బేబీపాండ్స్, పోర్ట్ టేబుల్, ఎక్స్‌లేటర్ పాండ్స్‌లను ఏరానపటుచేసినట్లు తెలిపారు. 172 రోడ్ల నిర్వహణ, 36 ట్రాన్స్‌పోర్టు పనులు, 140 స్టాటిక్, 292 మొబైల్ క్రేయిన్లు ఏర్పాటు, 169 గణేష్‌యాక్షన్ టీం, 309 మొబైల్ టాయిలెట్స్, 52,270 తాత్కాలిక విద్యుత్‌లైట్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ నుంచి అవార్డును స్వీకరిస్తున్న గౌస్‌హైదర్

## ప్రముఖ గాయకుడు గౌస్‌హైదర్‌కు ఇంటర్నేషనల్ బుద్ధపీస్ పురస్కార ప్రదానం

**నాంపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** వృత్తిరీత్యా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా కర్తవ్యాలు నిర్వహిస్తూ ప్రవృత్తిగా సామాజిక వేత్తగా, కరౌకే గాయకుడుగా 29ఏళ్ల ప్రస్తానం కొనసాగిస్తూ అనేక సంస్థల నుండి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న గౌస్ హైదర్ మైత్రీ పీస్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇంటర్నేషనల్ బుద్ధ పీస్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా గౌస్‌హైదర్‌కు బుద్ధపీస్ అవార్డును అందజేసి మైత్రీ సంస్థ విద్య, వైద్య, కళారంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి అవార్డులతో గౌరవించడం హర్షదాయకమన్నారు. పురస్కార స్వీకర్తలు మున్ముందు మరింత ఉత్సాహం, బాధ్యతాయుతం పనిచేయాలని సూచించారు. తన స్పందనలో గౌస్‌హైదర్ గవర్నరు చేతులమీదుగా అవార్డును అందుకోవడం చాలా అదృష్టం, ఆనందంగా ఉందన్నారు.

## 600 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ

**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** నగరం గణేష్ నిమజ్జనానికి సిద్ధమైంది. గణేశ్ శోభాయాత్రతోపాటు నిమజ్జన వేడుకలను వీక్షించాలనుకునే భక్తుల కోసం టిజిఎస్ ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. నగరవ్యాప్తంగా 600 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసి ఎండీ విసి సజ్జనార్ తెలిపారు. నగరంలోని అన్నిప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్ ప్రాంతాల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని జిహెచ్‌ఎంసి పరిధిలోని 30డిపోల నుంచి 15నుంచి 30బస్సులు అందుబాటులో ఉంటాయని ,భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గణేష్ నిమజ్జనోత్సవాలకు భారీ బందోబస్తు : ఏసిపి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:**

గణేష్ నిమజ్జనోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగే గణేష్ నిజమజ్జనోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పోలీసుసిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు జారీ చేసిన సూచనలు విధిగా పాటిస్తూ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. చట్టాన్ని అతిక్రమించినా, సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశించిన పికెట్స్, వద్ద, పుష్ పార్టీలు, ఫుట్‌పెట్రోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి సిఐ ఏరుకొండ సీతయ్య, ఎస్ఐలు మౌనిక, శిశుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో హైదరాబాద్ విముక్తి దినోత్సవ వేడుకలు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**

దేశ చరిత్రలో హైదరాబాద్ విముక్తి దినం అత్యంత ప్రధానమైందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామక్రిష్ణ తెలిపారు. తెలంగాణ విమోచన, హైదరాబాద్ విముక్తి దినోత ్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర ్భంగా పరేడ్ గ్రౌండ్‌లో సి.ఏ.అర్.పి.ఎఫ్,రక్షణ దళాలలచే మార్చ్‌ఫాస్ట్, 5 రకాల బేరీ నృత్యాలు, డిజిటల్ ప్రదర్శన, 800కుపైగా జానపద, సంప్రదాయ నృత్య కళాకారుల ప్రదర్శన జరగనున్నట్లు తెలిపారు.

# న్యాయవ్యవస్థలోనూ బిసిలకు అన్యాయం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హెచ్., గుజ్జకృష్ణ, వంశీకృష్ణ తదితర అతిథులు

**నాంపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో జూనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ జడ్జి పరీక్షలు రాసే బిసి అభ్యర్థులకు రాత పరీక్ష, వైవా-వోస్‌లలో కనీస కట్-ఆఫ్ మార్కుల సడలింపు లేకుండా నియమాలు పెట్టి ఆఖరికి న్యాయవ్యవస్థలోనూ బిసిలకు అన్యాయం చేయడం శోచనీయమన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అందరికి న్యాయం జరగాలని ఆకాంక్షించి కోర్టుల్లో వాదించే న్యాయవాదుల పట్ల ఈ చర్య సబబుకాదని ఆవేదన వ్యక్తపరిచారు. తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ సభాధ్యక్షతన రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐలోని జె.ఎస్.కృష్ణమూర్తి హాల్‌లో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యంగా అడ్వకేట్ అనేది ఎంతో న్యాయంతో కూడిన గౌరవపరమైన గొప్ప వృత్తి అని, సామాజిక బాధ్యత ఉందని, అలాగే సృజనాత్మకశక్తి ఉన్న న్యాయవాదులు ప్రతిభతోపాటు అన్యాయాన్ని, సమస్యలను ఎదిరించగలిగే ఉద్యమ స్ఫూర్తిని కలిసికట్టుగా ప్రదర్శించాలని, అప్పుడే న్యాయం జరిగే అవకాశముందని స్పష్టం చేశారు. న్యాయవాదులకు ఎలాంటి అన్యాయం జరిగినా ఎల్లవేళలా సంపూర్ణ తోడ్పాటు అందిస్తానని, పార్లమెంటులోనూ ఈ అన్యాయంపై ప్రస్తావించి న్యాయం జరిగేందుకు కృషిచేస్తానని భరోసానిచ్చారు. మరో ముఖ్యఅతిథి మాజీ పార్లమెంటు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా జడ్జిలకు పరీక్ష రాసే బిసి అభ్యర్థులకు రాతపరీక్ష, వైవా-వోస్‌ల్లో కనీస మార్కుల సడలింపులో అన్యాయం జరగడం బాధాకరమన్నారు. దేశంలో అత్యధిక శాతమున్న బిసిలకు అన్నిరంగాల్లో చట్టబద్ధమైన న్యాయం జరగాలంటే దేశవ్యాప్తం కులగణన జరగాల్సిందేనని, జనాభా ప్రాతిపదికన బిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. బిసిల్లో చైతన్యం వస్తేతప్ప రాజకీయ పార్టీలు ముందుకురావని, ఎప్పటివరకు పోరాడమో, బలం నిరూపించుకోమో ఈ దుస్థితి తప్పదని, బిసిలు ఎంత మెజార్టీవున్నా ముఖ్యంగా డబ్బులు తీసుకొని ఓటువేసే పరిస్థితి మారకపోతే మన బతుకుల్లో మార్పురాదని, ప్రయోజనం లేదని హితవు పలికారు. బిసిలు రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదగాలని, బిసిలు ముఖ్యమంత్రి అవ్వాల్సిందేనని, ఆనాడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు. బిసిలకు న్యాయం జరగాలన్నా, హక్కులు కాపాడుకోవాలన్నా, కోర్కెలు సాధించుకోవాలంటే ఉద్యమాలతోనే సాధ్యమని, అందుకు తమ పూర్తి మద్ధతు ఉంటుందని హనుమంతరావు హామీనిచ్చారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు ఐకమత్యాన్ని చాటుతూ అభివాదం చేశారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, నాయకుడు ఎర్ర సత్యనారాయణ, బార్‌కౌన్సిల్ వైస్‌ఛైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యుడు వెంకట్‌యాదవ్, న్యాయవాదులు రమేష్‌బాబు, నాగుల శ్రీనివాస్‌యాదవ్, బి.కృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన రెడిమిక్స్ లారీ
## భర్త మృతి, భార్యకు గాయాలు

**దుండిగల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** వేగంగా దూసుకువచ్చిన రెడిమిక్స్ లారీ ఓ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం... బీహార్‌కు చెందిన రాకేష్‌రాయ్(33), గుడ్డి దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలో నివాసం ఉంటున్నాడు. రాకేష్‌రాయ్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా భార్య కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం వ్యక్తిగత పనుల కోసం రాకేష్‌రాయ్ భార్యను తీసుకొని బైక్‌పై షాపూర్‌నగర్ వెళ్లి పనులు ముగించుకొని తిరిగి ఇంటికి బయలుదేరారు. బౌరంపేట కమాన్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతి వేగంతో దూసుకువచ్చిన రెడిమిక్స్‌లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిపోవడంతో రాకేష్‌రాయ్ మీదునుండి లారీ వెనుకచక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గుడ్డి గాయాలతో బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదానికి కారణమైన రెడిమిక్స్ లారీని సీజ్ చేయగా, డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది.